'స్వాతి' వారపత్రిక - 3.12.1993

# ముద్ర

"మామ్మా" అని పిలిచాడు రాహుల్.

మామ్మ పలకలేదు.

మళ్ళీ పిలిచేడు.

పలకలేదు మామ్మ.

గట్టిగా తట్టాడు.

లేవలేదు మామ్మ.

రాహుల్‌కి కోపం వచ్చి మామ్మను కొట్టబోయేడు.

అడ్డుకున్నాడు కృష్ణారావు.

అతను రాహుల్ తండ్రి. రాహుల్ మామ్మ అతనికి అమ్మ.

కొడుకుని అక్కడ నుంచి తీసుకుపోయే ప్రయత్నం చేశాడు.

రానని రాహుల్ మొరాయించేడు. అక్కడ నుంచి కదలలేదు.

మామ్మ తనని సినిమాకి తీసుకెళ్తానని చెప్పింది. చెప్పినట్టు సినిమాకి తీసుకువెళ్ళకుండా హాయిగా నిద్ర పోతోంది. అందుకు కోపంగా ఉంది. తనని ఈ రోజు ఏ మాత్రం పట్టించుకోకుండా తన మానాన్న తను నిద్ర పోతోంది. అందుకు దుఃఖంగా వుంది.

రాహుల్‌కి అయిదేళ్ళు. అయిదేళ్ళ నుంచీ తల్లిదండ్రుల వద్ద కన్నా మామ్మ దగ్గరే చేరిక ఎక్కువ.

రాహుల్ తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగస్తులవడంతో రాహుల్ బాధ్యత, ఆలనాపాలనా అంతా మామ్మ మీదే పడింది. డ్యూటీలను ముగించుకొని సాయంత్రం తల్లీ, తండ్రీ ఇంటికి చేరినప్పటికి – రాహుల్ వాళ్ళ దగ్గరికి అంతగా చేరడు.

మమ్మీ, డాడీ మంచివాళ్లేగాని ఎప్పుడు చదువూ చదువూ అంటారు. బలవంతంగా పుస్తకాల ముందు కూర్చోబెడతారు. ఏం చేస్తున్నా – అది తప్పు, ఇది తప్పు అని కసురుకుంటారు. అలాగ వుండాలి, ఇలాగ వుండాలి అంటూ బోర్ కొట్టేలా బుద్ధులు చెబుతారు.

అదే మామ్మ అయితే అలాక్కాదు. ఏది అడిగితే అది చేస్తుంది. తను ఏం చేసినా చెల్లుతుంది. తను ఆడే ప్రతి మాటకి చేసే ప్రతి చేష్టకి మురిసిపోతుంది. అన్ని విధాల సహకరిస్తుంది. ఉత్సాహపరుస్తుంది. తనని అర్థం చేసుకునేది మామ్మ ఒక్కతేనని రాహుల్ అభిప్రాయం.

వయసుకి మించి కబుర్లు చెబుతాడు. ఆ కబుర్లు వింటుంటే మామ్మే కాదు తల్లిదండ్రులు కూడా 'వీడు పిల్లడు కాదు. పిడుగు. చిచ్చర పిడుగు' అని మురిసిపోతుంటారు.

రాహుల్ రాత్రులు మామ్మ దగ్గరే పడుకుంటాడు. ఉదయం మామ్మే నిద్రలేపి తన కాలకృత్యాలు దగ్గరుండి చేయిస్తుంది. టిఫిన్ మామ్మే తినిపిస్తుంది. స్కూలు కెళ్ళడం మొదలుపెట్టి ఏడాది అవుతోంది. మొదటి రోజు నుంచి మామ్మే స్కూలుకి తీసుకువెళ్తోంది. స్కూలు ఒక్క పూటే. మధ్యాహ్నం తనే యింటికి తీసుకువస్తుంది. భోజనం పెడుతుంది. పడుకోబెడుతుంది. నిద్రలేచేక ఆట, లేకుంటే సినిమా.

సినిమా అంటే మామ్మా, మనవళ్ళకిద్దరికీ యిష్టమే.

ఇంట్లో వి.సి.ఆర్. వుంది. క్యాసెట్లు వీడియో షాపుకి వెళ్ళి తెచ్చుకునే పనిలేకుండా – రోజూ ఆ షాపుకి సంబంధించిన కుర్రవాడు కూరగాయల గంపలా క్యాసెట్లు పట్టుకొని తిరుగుతాడు. వారానికి ఒకటీ రెండు క్యాసెట్లు ఖచ్చితంగా తీసుకుంటారు. మిగతా రోజుల్లో కేబుల్ టీ.వీ. – ఇంచుమించు రోజూ సినిమా.

ఇవిగాక నెలకు రెండు సినిమాలు మమ్మీ, డాడీతో కలిసి థియేటర్‌కి వెళ్ళి చూస్తాడు రాహుల్.

నిన్న హోమ్‌వర్క్ చేయకుండా ఆటలో పడిపోయేడు. మామ్మ ఎన్ని రకాలుగా చెప్పి

చూసినా హోమ్‌వర్క్ జోలికి వెళ్ళలేదు. రాహుల్ చదవకపోవడానికి, అల్లరి మితిమీరిపోవడానికి కారణం తనేనంటూ నిందిస్తుంది కోడలు పిల్ల. అంచేత ఎలాగైనా హోమ్‌వర్క్ చేయించాలనే తపనతో మనవడికి సినిమా ఆశ పెట్టింది. చిరంజీవి సినిమా ఒకటి నగరంలో ఆడుతుండడంతో ఆ సినిమాకి రేపు తీసుకువెళ్తానంది. తను కిక్కురుమనకుండా హోమ్‌వర్క్ పూర్తిచేశాడు.

కాని మామ్మ ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదు. మోసం చేసి నిద్ర పోతోంది. ఉదయం నుంచీ నిద్ర పోతోంది. యింత మొద్దునిద్ర తనెప్పుడూ చూడలేదు. తను పిలిస్తే ఎంత నిద్రలోనైనా పలికేది మామ్మ.

ఈ రోజు పలకదేం?

ఏమయింది?

మామ్మకి బాగోలేదు. నిద్ర పోనీయ్ అంటున్నారు మమ్మీ డాడీ!

ఎప్పుడూ చదువుకోమనే వాళ్లు తనని బయటకుపోయి నవీన్, కిరణ్ దగ్గర ఆడుకోమంటున్నారు. వాళ్ళతో ఎంతసేపు ఆడేది?

మామ్మ చూపిస్తానన్న సినిమా సంగతేవిఁటి?

సినిమాకి టైమవుతోంది. నిద్ర లేవదేం?

మామ్మ ఈ రోజు తనని ముద్దుపెట్టి లేపి స్నానం చేయించలేదు. టిఫిన్ పెట్టలేదు. అన్నం తినిపించలేదు. ఇవన్నీ క్షమించేయగలడు. సినిమాని మాత్రం మర్చిపోయేది లేదు. మామ్మ లేచి తనను సినిమాకి తీసుకువెళ్ళి తీరాలి.

మామ్మ నేలపై చాప మీద ఉంది. తెల్లటి దుప్పటి కప్పబడి వుంది. నిద్ర లేవని మామ్మ గురించి రాహుల్‌కి కోపం వస్తోంది. ఏడుపు వస్తోంది.

రాహుల్‌కి నిజం చెప్పే ధైర్యం చాలడం లేదు కృష్ణారావుకీ, అతని భార్యకి. నిజం చెబితే ఆ పసిహృదయం తట్టుకోలేదని వాళ్ళ భయం.

ఆ పసివాడికి మామ్మ తల్లిని మించిన తల్లి.

అప్పటికే మామ్మ చుట్టూ ఇరుగు పొరుగు, బంధువులూ చేరసాగేరు.

ఎంతసేపు మభ్యపెట్టగలరు?

ఏడుస్తున్న రాహుల్‌తో –

"మామ్మ చచ్చిపోయిందమ్మా" అన్నారెవరో.

రాహుల్ బాంబు పడ్డట్టు తుళ్ళిపడ్డాడు.

మామ్మ ఎందుకు నిద్ర లేవలేదో అర్థమయిందిప్పుడు. రాహుల్ ముఖంలో రంగులు మారుతున్నాయి. కళ్ళు పెద్దవై ఎర్రబారుతున్నాయి. పిడికిలి బిగుసుకుంటోంది. కొడుకు స్థితిని చూసి భయపడి – దగ్గరకు తీసుకోబోయింది తల్లి.

దబ్బున తోసేసాడు, పడిపోయింది తల్లి.

రాహుల్ మామ్మపై పడి భోరున ఏడ్వలేదు.

'మామ్మ చచ్చిపోయింది' అనేది మమ్మీని, డాడీని అడిగి కన్‌ఫర్మ్ చేసుకున్నాడు.

ఆ వెంటనే - మెరుపులా అక్కడ నుంచి కదిలేడు.

పరుగున వంట గదిలోకి వెళ్ళి - అదే ఊపున తిరిగి వచ్చేడు. రాహుల్‌ని చూసి అంతా నిశ్చేష్టులైపోయేరు. ఊపిరి పీల్చడం మరిచేరు.

ఆ పసివాడి చేతిలో చాకు తళతళ మెరుస్తోంది.

"మామ్మను ఎవరు చంపారో చెప్పండి"

పులిపిల్లలా గాండ్రించేడు రాహుల్.

మామ్మని చంపింది అదిగో ఆ వ్యక్తే అని ఎవరైనా చూపిస్తే - కసక్‌మని పొడిచేసి పేగులు మెడలో వేసుకోవడానికి సిద్ధంగా వున్నాడు రాహుల్.

అక్కడ చేరిన వాళ్ళకి ముసలిదాని చావుకన్నా ఆ కుర్రవాని చేష్టలు ఆసక్తినీ, కుతూహలాన్నీ కలిగించేయి. రాహుల్ తల్లిదండ్రులకయితే మతిపోయి, ఏం చేయాలో తోచని స్థితిలో వున్నారు.

"డాడీ! చెప్పు. మామ్మను ఎవరు చంపారు?" పదునుగా వచ్చాయి ఆ మాటలు.

చచ్చిపోయింది గాని లేకుంటే మనవడిని ఆ పోజులో చూసి తెగ ముచ్చటపడిపోయి ముద్దులు కురిపించేది మామ్మ.

"మామ్మను ఎవరూ చంపలేదమ్మా" అన్నాడు అతి నెమ్మదిగా కృష్ణారావు.

"అబద్ధం ఆడకు డాడీ! చచ్చిపోయిన మామ్మ నిద్ర పోయిందని ఒక అబద్ధం ఆడేవు. రెండో అబద్ధం ఆడి, హంతకుడిని దాచకు. మామ్మను ఎవరు చంపేరో చెప్పు" - తండ్రి అనే భయం లేదు ఆ గొంతులో.

"మీ మామ్మను ఎవరు చంపుతారమ్మా. ఎవరికి అపకారం చేసిందని. మీ మామ్మ మంచి మామ్మ."

"అది నిజంగా నిజం డాడీ! మామ్మ మంచిది. మంచివాళ్ళనేగా చంపేస్తారు"

రాహుల్ అయిదేళ్ల వాడయినా ఎంతో ప్రపంచాన్ని చూసినట్టు, ఆ ప్రపంచంలో మంచివాళ్ళే దారుణంగా, క్రూరంగా చంపబడడం కళ్ళారా చూసినట్టు దృఢంగా అన్నాడు.

కృష్ణారావుకి ఏం చేయాలో పాలుపోవడం లేదు. అతనిలో ఆందోళన క్షణక్షణానికి పెరుగుతోంది.

"మనం కత్తులూ తుపాకులు పట్టుకోగూడదమ్మా. అందుకు పోలీసులు ఉన్నారు. హంతకుల అంతు వాళ్ళే చూస్తారు. మనం కాదు" అంటూ ఆ చాకుని ఇచ్చేయమన్నాడు కృష్ణారావు.

దూరంగా జరిగి "ఇవ్వను" అని స్పష్టంగా అన్నాడు రాహుల్.

"పోలీసుల గురించి నాకు చెప్పకు డాడీ! వాళ్ళేమీ చేయలేరు. వాళ్ళు చేతకాని వాళ్ళు. లేదా హంతకులతో చేతులు కలిపేవాళ్ళు. అంచేత నేనే మామ్మను చంపిన వాడి ప్రాణం

తీసి రక్తం తాగేస్తా."

కోల్పోయింది అత్తగారిని కాదు. కొడుకునే అన్నట్టు మౌనంగా రోదిస్తోంది రాహుల్ తల్లి.

తండ్రికి ముచ్చెమటలు పోశాయి.

పసివాడు ఇంత వయిలెంటుగా రియాక్టు అవుతున్నాడేమిటి? ఎన్నో ఆశలు పెట్టుకొని పెంచుతున్న కొడుకు, గొప్ప గొప్ప చదువులు చదివి ప్రయోజకుడు అవుతాడన్న కొడుకు... చంపేస్తాను అంటూ చేతిలో చాకుతో విన్యాసం చేస్తూ... ఏమిటిది?

"మామ్మ నెవరు చంపారో చెప్పడం లేదు మీరు" అసహనంగా అన్నాడు రాహుల్.

"లేదమ్మా! మామ్మ నెవరూ చంపలేదు"

"నేను నమ్మను"

"లేదు రాహుల్. నిజం చెబుతున్నాను. నన్ను నమ్ము. మామ్మ నెవరూ చంపలేదు"

"ఎవరూ చంపకపోతే మామ్మ ఎలా చచ్చిపోతుంది?" – బుల్లెట్‌లా వచ్చాయి ఆ మాటలు.

హతాశుడయ్యేడు తండ్రి.

నిస్సత్తువతో నేల కూర్చుండిపోయింది తల్లి.

దిమ్మెరపోయేరు అక్కడ చేరిన వారంతా.

"చంపితేనే చచ్చిపోతారా! నీకెవరు చెప్పారు?"

"నాకెవరూ చెప్పక్కర్లేదు. నాకు తెల్సు"

"చంపితే చచ్చిపోవడం నిజమే రాహుల్. కాని చచ్చిపోయిన వాళ్ళంతా చంపబడ్డవాళ్ళు కాదు. నూటికి తొంభై తొమ్మిది మంది సహజంగానే మరణిస్తారు. వయసయిపోయిన వాళ్ళు అంటే అరవై, డెబ్బయి వయసు దాటేక శరీరంలో శక్తి కోల్పోయి చచ్చిపోతారు. మా మామ్మ అలాగే చచ్చిపోయింది. మా నాన్న అలాగే చచ్చిపోయేడు. రేపు నేనూ అంతే. ఇక్కడున్న మమ్మీ, అంకుల్, ఆంటీ... అంతా అలాగే చచ్చిపోతారు. లేకుంటే ఏదైనా జబ్బు చేసి, సరైన వైద్యం దొరక్క చచ్చిపోతారు. అప్పుడప్పుడూ ప్రమాదాల వల్ల కూడా చచ్చిపోతారు. హత్యలు ఎక్కడో ఎప్పుడో గాని జరగవు. మీ మామ్మ నిద్దట్లోనే చనిపోయింది. సహజమైన చావు. హత్య కాదు."

"డాడీ! నాకు కథలు చెప్పకు. నేనీ కథను నమ్మను. నాకు చెప్తావేటి డాడీ! మామ్మనే కాదు చచ్చిపోయిన వాళ్ళను ప్రతి రోజూ చూశాను. వందల వందల మందిని చూశాను. వాళ్ళెవ్వరూ.. ఏ ఒక్కరూ నీవు చెప్పినట్టుగా చచ్చిపోలేదు. చంపబడ్డారు. కత్తిపోట్లకీ, తుపాకీ గుళ్ళకీ చచ్చారు. నా మామ్మనూ అలాగే చంపేశారు. చంపింది ఎవడో చెప్పండి. వాడిని ఇదిగో... ఈ చాకుతో వందపోట్లు పొడిచి చంపుతా."

రాహుల్ అమితాబ్‌లా నిలబడి చిరంజీవిలా చాకు ఝుళిపిస్తున్నాడు. రాహుల్ చేతిలో చాకు ఈ వికృతి వ్యవస్థకు ప్రతీకలా మెరుస్తోంది.